విష్ణుమూర్తి అనేక అవతారాలలో వచ్చాడు. వామనావతారం చూస్తూ ఉంటే సౌందర్యమే వచ్చి భూమిమీద నడుస్తోందా అనిపిస్తుంది. బలిచక్రవర్తి మంచివాడు, గొప్పదాత. నేను గొప్పవాడిని, నేను చేసిన దానాలు ఎవరూ చేయలేరు అనే అహంకారం పెట్టుకొని పాడైపోతున్నాడు, ఆబుద్ధిని పోగొట్టటానికి వామనావతారంలో వచ్చాడు. బలిచక్రవర్తికి నేను మహాదాతను అనే గర్వం ఉంది. ఆ గర్వాన్ని అణిచివేసి తన స్వరూపాన్ని ఇవ్వటానికి వచ్చిన అవతారమే వామనావతారం. బలిచక్రవర్తిని శిక్షించటానికి రాలేదు, బలిచక్రవర్తిని అనుగ్రహించటానికి వచ్చినదే వామనావతారం. ఏమీ అక్కరలేదు, మీలో ఎవరయినా ఒక్కరు మంచివారు ఉన్నారు అనుకోండి మీ ఒక్కరికోసం, మిమ్మల్ని తరింపచేయటం కోసం భగవంతుడు శరీరం ధరించి వస్తాడు, అంత కరుణామయుడు. ఒక్క ప్రహ్లాదుడికోసం లక్ష్మీనరసింహస్వామి అవతారం వచ్చింది. మీరు ఏదో ఒక అవతారాన్ని ఆశ్రయించి, స్మరించి, తరించండి. చేతిలో డబ్బు లేకుండా బజారులో ఉన్న వస్తువును మనం ఆశించకూడదు అలాగే ధర్మాన్ని ఆచరించకుండా శాంతిని ఆశించకూడదు, జ్ఞానాన్ని ఆశించకూడదు. డబ్బు ఏమీలేనివాడు నేను భోగం అనుభవించాలి అనుకోవటం ఎటువంటిదో ధర్మాచరణ లేకుండా నాకు శాంతి కావాలి, జ్ఞానం కావాలి అనుకోవటం అటువంటిది. శాంతి అనేది ఎక్కడో పై నుంచి వచ్చిపడుతుంది అనుకొంటున్నారు. మన ప్రవర్తన మీద, మన జీవితవిధానం మీద, మన రాగద్వేషాలు తగ్గించుకోవటం మీద శాంతి రావటం ఆధారపడిఉంది అనే అవగాహన మనకు రావటం లేదు. డబ్బు వల్ల, విద్య వల్ల శాంతి రాదు. ధర్మాన్ని ఆచరించటం వలన, మన మనస్సును నియమించుకోవటం వలన, క్రమశిక్షణ వలన శాంతి దొరుకుతుంది. శాంతి అనేది బజారులో దొరికే వస్తువు కాదు. శాంతి మీ హృదయంలోనే ఉంది. అది ఎక్కడ ఉందో అక్కడ వెదకండి మీకు దొరుకుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-05, పాతాళమెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జ్ఞానం అనేది ఎవరో ఒక వ్యక్తి యొక్క ఆస్తికాదు, జ్ఞానానికి, శాంతికి, ఆనందానికి అందరూ వారసులే. కాని మీరు అనుకోవటాలు వదిలివేయండి. మేం మంచి వాళ్ళం అని, మేం చెడ్డవాళ్ళం అని లేకపోతే మేము గొప్పవారమని, మేము తక్కువవారమని ఇలా అనుకోవటాలు మానివేయండి. ఈ అనుకోవటాలు మానివేస్తే నేను ఈ పుస్తకాన్ని వదిలేస్తే భూమి యొక్క ఆకర్షణశక్తి వలన ఎలా కిందపడిపోతుందో అలాగ, మీరు అనుకోవటాలు మానివేస్తే మీ హృదయంలో ఉన్న వస్తువే మిమ్మల్ని లోపలకు గుంజుకొంటుంది, అప్పుడు మీ మనస్సు వెళ్ళి

ఆధ్యాత్మికహృదయంలో లయమవుతుంది అంటే అది మీ అజ్ఞానాన్ని తీసుకొంటోంది, మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. మీరు రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందటం వలన మీకు వికారాలు వస్తున్నాయి. కాని మన హృదయంలో ఉన్న సద్వస్తువు అది సహజంగా ఉంటుంది, నిర్వికారంగా ఉంటుంది, నిరాడంబరంగా ఉంటుంది, చాలా సింపుల్‌గా ఉంటుంది. అది ఎంత సింపుల్‌గా ఉందో అలాగ మనం జీవిస్తూ ఉంటే, మన ప్రవర్తన అలాగ ఉంటే ఆ వస్తువు యొక్క అనుగ్రహాన్ని పొందుతాము.

మనం ఏ వస్తువును పొందటానికి యజ్ఞ, యాగాలు చేస్తున్నామో, మనం దేనికోసమైతే జపధ్యానాలు చేస్తున్నామో ఆ వస్తువు మనమై ఉన్నాము. మనలను మనం సంపాదించుకోవటం ఏమిటి? దీనికి రమణాచార్యుడు ఏమిచెప్పారు అంటే ఇందులో మీరు సంపాదించుకొనేది ఏమీ లేదు, పోగొట్టుకొనేదే ఉంది అనేవారు. ఇప్పుడు మీరు కాని దేహంతోటి, మీరుకాని మనస్సుతోటి, మీరు కాని గుణాలతోటి తాదాత్మ్యం పొందుతున్నారు. ఇలా మీరుకాని వస్తువులతో తాదాత్మ్యం వలన మీ స్వరూపానికి దూరమవుతున్నారు. మన స్వరూపానికి మనం దూరమయ్యే కొలది మనకు మిగిలేది అశాంతి, దుఃఖం. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది మిధ్యానేను, అదే దేహంతో తాదాత్మ్యం పొందుతుంది, అదే ప్రధమతలంపు, అదే మన దుఃఖానికి కారణం. ఈ రాంగ్ ఐ ఉన్నంతసేపు రాంగ్ తింకింగ్ కూడా ఉంటుంది. ఈ దేహగతమైన నేను ఎప్పుడైతే నశించిందో అప్పుడు లోపల ఉన్న సద్వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. ఇందులో సంపాదించుకొనేది ఏదీ లేదు, పోగొట్టుకొనేదే ఉంది. సాధన అంటే లోపల ఉన్న వస్తువును సంపాదించుకోవటం కాదు, అది నీకు అనుభవంలోనికి రాకుండా ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటమే సాధన యొక్క గమ్యం. మీరు యోగులు, ఋషులు అవ్వాలంటే అది డబ్బు పెట్టి బజారులో కొనుక్కొనే వస్తువు కాదు. ఆ వైభవం అంతా మన హృదయంలోనే ఉంది. దానిని పొందటానికి పూర్వం మన మహారాజులు రాజ్యాన్ని కూడా విడిచిపెట్టారు. మనం దేహంతో తాదాత్మ్యం పొందుతున్నాము. అందుచేత దేహం మరణించినప్పుడు నేను మరణిస్తున్నాను అనుకొంటున్నాము. దేహం మరణిస్తున్నా మరణం లేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. దేహం మరణించకముందే ఆ వస్తువుతో మనకు తాదాత్మ్యం వస్తే దేహం మరణించినా నేను ఉంటాను అనే అనుభవం నీకు కలుగుతుంది, అప్పుడు నీవు మరణరహితస్థితిని పొందుతావు, అదే మన జీవిత గమ్యం. ఒకవేళ ఆ స్థితిని పొందకుండా బాహ్యంగా నీవు ఏదైనా సాధించినా అది అంతా కూడా స్వప్న మాత్రం. మనమాట ద్వారా, చేతద్వారా, ఆలోచన ద్వారా మిధ్యానేనుకు ఫుడ్ సప్లయి అవ్వకుండా చూసుకోవాలి. అదే సాధన. దేహగతమైన నేనుకు ఫుడ్‌సప్లయి

చేయటం మానివేస్తే కొంతకాలానికి దానంతట అదే సన్నగిల్లి రాలిపోతుంది.

మన సొంతం అంటూ ఏమీ లేదు, ప్రతీది ఈశ్వరుని దయే, మీరు ఏదైనా పొందినా అది అంతా ఈశ్వరుని దయే. నువ్వు తినే అన్నం కూడా నీది కాదు, అదీ ఈశ్వరుని దయే, దానిని ప్రసాదంగా స్వీకరించు. నేను, నాది అనేవి రెండూ తలంపులే. ఇవి గాఢంగా ఉండటం వలన మనం అశాంతికి గురి అవుతున్నాము, మన దుఃఖానికి కారణం ఇవే. మాయ ఎక్కడో ఉంది అని అనుకోవద్దు, ఈ నేను రూపంలోనే ఉంది. నేను భగవంతుడి కంటే వేరుగా ఉన్నాను అనే వేరుభావనను తీసుకొని వచ్చేది కూడా ఇదే. అందులో నుండి నువ్వు విడుదల పొందు. మీకంటే నాలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటున్నాను అనుకోండి, అది కూడా నిజం కాదు, అది కూడా ఈ నేను యొక్క కల్పితం, దానిని తొలగించుకో, అదే సాధన. నీకు చదువు ఉండవచ్చు ఆ చదువు నువ్వు కాదు, నీకు ధనం ఉండవచ్చు ఆ ధనం నువ్వు కాదు. ఇలా కానిదానితో తాదాత్మ్యం పొంది నేను గొప్పవాడిని అనుకొంటుంది, ఇది నిజం కాదు. ఈ మిథ్యానేనులో నుండి విడుదల పొందు.

గురువు యొక్క మాట అనుగ్రహం, చూపు అనుగ్రహం, మౌనం అనుగ్రహం, అంతా అనుగ్రహమే. గురువు యొక్క దయ ఇట్టిది అని మనం ఊహించలేము, అది మన మనస్సుకు అందదు. ఈ క్షణంలో నిన్ను మహోన్నతమైన మోక్షసామ్రాజ్యానికి అధిపతిని చేయగలడు. మీతో మాట్లాడుతూ, మీతో కలిసి తిరుగుతూ ఏ మిథ్యానేను అయితే మిమ్మల్ని ఇబ్బంది పెడుతోందో అందులోనుండి మిమ్మల్ని విడుదల చేస్తాడు, సత్యవస్తువును మీకు అనుభవం లోనికి తీసుకొని వస్తాడు. అంటే సాధన చేయించేవాడు, వస్తువును పొందింపచేసేవాడు కూడా ఆయనే. ఇంక మనం అంటూ ఏమీలేదు. ఎప్పుడయినా మనం భగవంతుడిని స్మరించుకొంటున్నాము అంటే అది మన తెలివితేటల వలన కాదు, ఆయన దయ వలననే మనం ఆయనను స్మరించుకొంటున్నాము, ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. ఆయనను కాదని మనం చేసేది ఏమీలేదు. నువ్వు ఎవరో నీకు తెలియకుండా నీ బంధువులు కాని, స్నేహితులు గాని, బయట ఏమీ అడ్డు రావటం లేదు, ఈ మిథ్యానేను నీకు అడ్డు వస్తోంది. గురువు అనుగ్రహం లేకుండా ఈ మిథ్యానేనులో నుండి మనం విడుదలపొందలేము. మనం ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే, మనలో ఉన్న బలహీనతలు, అమృతానుభవం పొందకుండా మనలో ఏవైతే ఆటంకాలు ఉన్నాయో అవి అన్నీ కూడా ఆయన అనుగ్రహ ప్రవాహంలో కొట్టుకొని పోతాయి, గురువు యొక్క అనుగ్రహం అత్యంత బలీయమైనది, మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, వ్యతిరేకంగా ఉన్నా కూడా ఈశ్వరుని పాదాలయందు భక్తిని విడిచిపెట్టకూడదు. కోట్లాది

రూపాయలు ధనం ఉన్న వారికంటే, ఉన్నతమైన పదవులు అధిష్టించిన వారికంటే ఈశ్వరునిపాదాలయందు భక్తి ఉన్న ఒక చీమ గొప్పది అని గురునానక్ చెప్పారు. భక్తి లేని జీవితం ఎందుకు? అసలు వైభవం అంతా భక్తి లోనే ఉంది. శివ, రామ, కృష్ణా అని మీ నోటితో దైవనామం చెయ్యరు అనుకోండి పుట్టలో ఉన్న పాముకి మీ నోటిలో ఉన్న నాలుకకు తేడా ఏముంది అని ఒక కవి అన్నాడు.

తెరమీద ఏదైనా బొమ్మ ఉంది అనుకోండి, తెర ఆ బొమ్మకే పరిమితమై లేదు, ఆ బొమ్మకు ఆధారంగా ఉంది, ఆ బొమ్మలేని చోట కూడా తెర ఉంది. అలాగే ఈశ్వరుడు అంతటా ఉన్నాడు. అందులో ఏదో ఒక భాగంలో ఈ సృష్టి మనకు కనిపిస్తోంది. ప్రపంచం అనేది మంచిది కాదు, చెడ్డది కాదు, ఇది ఒక ట్రైనింగ్ గ్రౌండ్ అంతే అన్నారు భగవాన్. ఈ ప్రపంచం మంచిది అని కొంతమంది, చెడ్డది అని కొంతమంది అనుకొంటున్నారు. ఈ ప్రపంచం ఇలా ఉంది అని కొంతమంది, అలా ఉంది అని కొంతమంది అనుకొంటున్నారు. ప్రపంచం గురించి నువ్వు కల్పించుకొన్న గొడవలు అన్నీ వదిలెయ్యి, నీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది, నువ్వు సుఖంగా, శాంతిగా ఉంటావు. ఈ లోకానికి ఒక యజమాని ఉన్నాడు, ఈ లోకం గొడవ ఆయన చూసుకొంటాడు. ఈ లోకం గురించి నీవు ఏదో ఊహించుకోవద్దు, కల్పించుకోవద్దు, నువ్వు క్వయిట్‌గా ఉండు అనుకొనేది జీవసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. అందుచేత ఎవడైతే ఈశ్వరసంకల్పాన్ని పరిపూర్ణంగా గౌరవిస్తున్నాడో ఎవడైతే ఈశ్వరసంకల్పాన్ని హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాడో వాడి మనస్సు అణుగుతుంది, వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఈ సృష్టిలో ఏది జరిగినా భగవాన్ ఎప్పుడూ ఆశ్చర్యం వ్యక్తపరచలేదు. అలా జరగవలసి ఉంది, జరిగింది అంతే అనేవారు. మనం లోపల ఔన్నత్యం పెంచుకొంటూ రావాలి, లోపల సాధన పెంచుకోవాలి, లోపల కూల్‌గా ఉండాలి, బయటకు అందరిలాగే కామన్‌గా ఉండాలి. కొంచం సాధనచేసి ఏదో ప్రత్యేకత సంపాదించాము అనుకొంటే మరల వెనక్కి వెళ్ళిపోతాము. ఒక అడుగు ముందుకు వేసి మరల నాలుగు అడుగులు వెనక్కి వేస్తే మనం గమ్యానికి ఎలా వెళ్ళగలము. ఏదో కొంత సాధన చేసి మేము బాగానే చేస్తున్నాము అని ఊహించుకొంటే ఉన్నది ఊడిపోతుంది. బయట ఉన్న గురువు నిన్ను లోపలకు పంపటానికి ప్రయత్నం చేస్తాడు. ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యముఖమవుతోందో చూసుకొని దానిని కట్ చేస్తాడు. నిజమైన గురువు మన లోపలే ఉన్నాడు, ఆయన నిన్ను లోపలకు లాగుకొంటాడు. ఎప్పడైతే మూలతలంపు మూలాన్ని నువ్వు టచ్ చేసావో, దాని తాలుక స్పర్శ, దాని తాలుక రుచి నీకు ఎప్పడైతే తెలిసిందో అప్పడు ఆనందసముద్రం ఒక్కసారిగా పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పడు మనస్సు

పడిపోతుంది, బేధబుద్ధి పడిపోతుంది, నీవు కానిదానిలో నుండి సహజంగానే విడిపోతావు. ఆత్మానందాన్ని ఎంజాయ్ చేయటానికి ఎప్పుడో శరీరం చనిపోయేవరకు మీరు ఆగనక్కరలేదు. మీరు కానిదానితో తాదాత్మ్యం వదిలేయండి, లోపలఉన్న ఆనందాన్ని ఇప్పుడే అనుభవించవచ్చు.

నేను అలిసిపోయాను, నేను అలిసిపోయాను అని ప్రతీగంటకు అనుకోనక్కరలేదు. మీరు సహజంగా, నిర్మలంగా జీవించండి. మన మాటలో, చేతలో, ఆలోచనలో ఆడంబరం కనబడకూడదు. లోపల పని జరిగిపోతూ ఉండాలి, వ్యక్తి కనబడకూడదు. నీ శరీరాన్ని చంపనక్కరలేదు, వేరుభావనను చంపు. దేహంతో తాదాత్మ్యం పొందే మొదటితలంపే వేరు భావనను తీసుకొని వస్తోంది, దానిని సంహరించు సరిపోతుంది, అదే సాధన. దాని కోసం నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి. సత్యాన్ని తీసుకొని వెళ్ళి ఒక రూపానికి, నామానికి పరిమితం చేస్తున్నాము, ఇది దురదృష్టం. ఏసుక్రీస్తు దేవుడు అని ఈ మధ్య ఒకరు నాకు లెటరు వ్రాసారు. అంటే ఏసుక్రీస్తు శరీరం దేవుడా? అంతటా వ్యాపించి ఉన్న బ్రహ్మాన్ని తీసుకొని వచ్చి ఒక రూపానికి, నామానికి బంధించటం అంటే సత్యాన్ని అగౌరవ పరచటం అవుతుంది. మనం సాధనకోసం ఒక రూపాన్ని, నామాన్ని సపోర్టుగా తీసుకోవచ్చు. బాహ్యమైన ప్రక్రియలకు, మహిమలకు మోసపోవద్దు. వాటిమీద మోహం కలగటానికి నీ మనస్సులో ఉన్న మాయ కారణం. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చెయ్యి. ప్రపంచంలో అనేకమంది మహాత్ములు, మహర్షులు ఉన్నారు. ఎవరి సమక్షంలో నీ మనస్సు యొక్క విజృంభణ ఆగిపోతోందో, ఎవరి సమక్షంలో నీకు లోచూపు కలుగుతోందో, ఎవరి సమక్షంలో నిర్వాణసుఖం యొక్క రుచి ఎంతోకొంత నీకు తెలుస్తోందో వారిని గురువుగా తీసుకో. వాడు ఏమతస్థుడు, ఏ కులస్థుడు అనేది అనవసరం. ఈ పద్ధతిలోనే ఉండు అని బలవంతం చేసే అలవాటు భగవాన్‌కు లేదు, అసలు ప్రపంచమే లేనివాడికి బలవంతం ఏమిటి?

ధర్మం, అధర్మం అంటే ఏమీలేదు. మన డ్యూటీ మనం చేయటం ధర్మం, మన డ్యూటీ మనం చేయకపోవటం అధర్మం. మనిషి పుట్టాడు అంటే వాడికూడా దుఃఖం వచ్చేస్తుంది. వాడు ఎంత ధనవంతుడు అయినా ఎంతోకొంత దుఃఖస్పర్శ లేని మనిషిని చూపించండి. మనం ఇష్టంతోగాని, అయిష్టంతోగాని పనులు చేస్తాము. ఇష్టాలు, అయిష్టాలు ప్రక్కన పెట్టి భగవంతుడు చేయమని చెప్పాడు కదా అని పనులు చేయము. రాగద్వేషాలను ప్రక్కన పెడితే కర్మ మనలను చుట్టుకోదు. రాగద్వేషాలతో కర్మచేస్తాము, దానినిబట్టి జన్మ వస్తుంది, జన్మ వస్తే దుఃఖం వస్తుంది. రాగద్వేషాలు ఎందుకు వస్తున్నాయి అంటే దేహంతో తాదాత్మ్యం పొందే నేను వలన వస్తున్నాయి. ఈ నేనులో నుండి విడుదల పొందకుండా కర్మచక్రంలోనుండి బయటకు రాలేవు, అజ్ఞానం

అంటే ఎక్కడో ఉంది అనుకోవద్దు, ఈ నేను రూపంలోనే ఉంది, ఇది లేకపోతే ఏదీ లేదు. ఇదే మూలతలంపు. ఈ మూలతలంపు మూలంలోనే సత్యం ఉంది. నీ మనస్సుకు అంతర్‌దృష్టిని కలుగజెయ్యి. నీ మనస్సుకు లోచూపు కలుగజేసేవాడే గురువు. గురువు యొక్క ప్రేమ భౌతికమైనది కాదు. గురువు మనలను ప్రేమిస్తాడు దానికి కారణం కనబడదు. అకారణ భక్తి, అకారణ ప్రేమ వలన మనకు జ్ఞానోదయం కలుగుతుంది. సత్యం నీ హృదయంలోనే ఉంది. దాని గురించి మనం నోటితో చెప్పలేము, చేతితో వ్రాయలేము. అది లేదా అంటే ఉంది. అది ఉండటం వలననే అది తెలియబడుతుంది. గాఢనిద్రలో, స్వప్నావస్థలో, జాగ్రదవస్థలో ఒక్క క్షణం కూడా బ్రేక్ లేకుండా తనంతట తానుగా అది ప్రకాశిస్తోంది. దానికి చావు ఎలా ఉంటుందో, పుట్టుక ఎలా ఉంటుందో తెలియదు, అది ఆనందసముద్రం, సుఖసముద్రం, శాంతిసముద్రం. చావు పుట్టుకలతో సంబంధం లేని, ప్రకృతితో సంబంధంలేని, దేహంతో సంబంధంలేని ఆ సుఖాన్ని నీవు ఎంజాయ్ చెయ్యాలంటే మిధ్యానేను అనే తెరను తొలగించు అంటే మిధ్యా నేనును ఎలిమినేట్ చెయ్యి అప్పడు సుఖసముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది, అప్పడు సాధన చేసేవాడు కూడా నీకు కనబడడు, వాడు శాంతిసముద్రంలో కొట్టుకొని పోతాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 13-11-05, విశాఖపట్నం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పనిచేసేటప్పడు నిండు మనస్సుతో, హృదయపూర్వకంగా, నిర్మలంగా, నిశ్చలంగా, నిరాడంబరంగా చేసుకొంటూ వెళ్ళాలి. ఇతరులతో పోల్చుకోవలసిన అవసరం లేదు. ఇతరులతో పోల్చుకొంటే మేము గొప్పవారము, మేము తక్కువ వారము అనిపిస్తుంది, దానివలన ద్వైతబుద్ధి పెరుగుతుంది. సమాజానికి సంబంధించినంత వరకు మనం పెద్ద పని చేసామా, చిన్న పని చేసామా అనేది ముఖ్యం కాదు. మనవంతు కృషి మనం చేస్తే సరిపోతుంది. ఒకసారి కాంగ్రెస్ గురించి డొనేషన్స్ ఇస్తూఉంటే 10 రూ॥ ఇచ్చేవారు ఇచ్చారు, 20 రూ॥ ఇచ్చేవారు ఇచ్చారు, 100 రూ॥ ఇచ్చేవారు ఇచ్చారు, ఒక బీద ముసలమ్మ ఒక రూపాయి ఇచ్చింది, బోస్ ఆ రూపాయిని ముద్దు పెట్టుకొన్నాడు. అమ్మా ఈ రూపాయి ముఖ్యం కాదు, ఈ రూపాయి వెనుకనున్న నీ ప్రేమ ముఖ్యం, ఆ ఆప్యాయత ముఖ్యం అన్నాడు. ఒకరు గాంధీగారికి ఏదో పని నిమిత్తం ఒక లక్ష రూపాయలు డొనేషన్‌గా ఇచ్చి, బాపూజీ మీరు సంతోషించారు కదా అని అన్నాడు. అప్పడు గాంధీగారు ఏమన్నారు అంటే నేను ఇప్పడు సంతోషించను, ఇచ్చే వాడిని ఇచ్చేస్తే అప్పడు నేను సంతోషిస్తాను అన్నారు. రాముడు చాలా శక్తివంతుడు, ఆయనకు ఎవరి సహకారం అక్కరలేదు. కాని లంకకు వారధి నిర్మించే టప్పడు అందరు ఎవరివంతు కృషి వారు చేసారు. లోకాచారం